శ్రీమతీ! బస్సువచ్చేవేళైంది! త్వరగా రా!... అంటూ వీధిలో నిలబడ్డ రంగనాథం ప్రేమగా పిలిచాడు భార్య సౌభాగ్యాన్ని.

ఇదిగో వచ్చేస్తున్నానండీ! బస్‌వస్తే ఆపు చేయండి, నేను సిద్ధం... అంటూ బేగ్ భుజాన వేసికొని వీధిలోకి వచ్చింది సౌభాగ్యం!

ఇంతలో బస్‌రానే వచ్చింది. రంగనాథం చెయ్యెత్తడంతో అది గుమ్మంముందే ఆగింది. ఇద్దరూ బస్సెక్కారు. కిటికీ ప్రక్కనే చతికిలపడ్డ భార్యముఖంలోకి చూశాడు. పుచ్చపువ్వులా విప్పారి ఉంది. ఆమె క్రీగంట చూసిందేమో, ఓ చిరునవ్వు విసిరింది! టికెట్! టికెట్!... అంది కండక్టరమ్మ కంఠం!

రాజమండ్రికి రెండు టిక్కట్లు ఇయ్యమ్మా!... అన్నాడు రంగనాథం వందరూపాయల నోటు ఆమె చేతికందిస్తూ.

సౌభాగ్యం ఆమెవైపు చూసింది.

సుశీ! నువ్వు కండక్టరెపుడయ్యావ్?... అంది చిన్ననాటి మిత్రురాలిని ఈవేషంలో చూసిన సౌభాగ్యం!

ఇటీవలే అయ్యాను. ఇంతకీ ఈ హడావిడంతా ఏమిటి? అంది సుశీల!

ఆఁ ఏముందిలే... పెళ్లయి పదేళ్లయినా పిల్లాపీచులేరుగా! గోదార్లో స్నానం చేస్తే కాస్తం



# తీరిన కోరిక

త పుణ్యందక్కి కడుపు పండుతుందేమోనని వెడుతున్నాం అంది సౌభాగ్యం.

నిజమేసుమా! మనతో చదువుకొన్న లక్ష్మి కూడా ఏడాదిక్రితం గోదార్లో స్నానం చేస్తే ఈ ఏడాది సంతానలక్ష్మి అయింది. నీక్కూడా ఓ పిల్లాడు పుడతాడులే!... అంటూనే టిక్కట్లు, చిల్లర ఆమె చేతిలో పెట్టింది! ప్రేమతో భుజాన్ని తట్టింది. అంతే... సౌభాగ్యం ఆనందానికి అంతేలేదు పిల్లాడు ఒళ్ళో ఉన్నట్లే భావించింది.

ముఖం కళకళలాడుతోంది. సౌభాగ్యం పైట గాలికి రెపరెపలాడుతోంది. ఏమండీ! మన గ్రామదేవతకి మొక్కుకున్నానండీ, మనకి సంతానం కలిగితే మంచి చీర, జాకెట్టు పెడతానని... అంది ప్రక్కనే కూర్చున్న భర్తతో.

అయితే ఇంక గోదారి స్నానం ఎందుకు?... అన్నాడు ప్రశ్నార్థకంగా రంగనాథం!

మీరెపుడూ ఇలాగే మాట్లాడుతారు. స్నానం ఒక్కటే కాదండీ! ఇంకా చాలా ఉన్నాయ్.

ఏమిటో అవి చెప్పొచ్చుగా!

ఆం అవన్నీ ముందే చెబితే, నేతెస్తాలే అంటారు. అందుకే చెప్పలేదు.

పోనీ, ఇపుడు చెప్పొచ్చుగా!... అన్నాడు నవ్వుతూ.

స్వామీ! ఈ పదేళ్ళనుంచీ అత్తయ్యగారే ఆవకాయ పెట్టిస్తున్నారు. వారా పెద్దవారయ్యారు... ఈసారి మనమే ఊరగాయలు పెట్టుకొందాం!

బాగానే ఉంది. ఊరగాయలకి, రాజమండ్రికీ సంబంధమేమిటా అని?...

అక్కడ మంచి జాడీలు దొరుకుతాయని మా అమ్మ చెప్పింది. ఓ రెండు జాడీలు కొందామని.

అవునవును... నువ్వు జాడీలు కొనుక్కోనూ వచ్చు, నన్ను గోదార్లో ముంచనూవచ్చుంటావ్!

అయ్యోరామ! అదేంమాటండీ!... అంటూనే మెళ్ళోని పుస్తెని కళ్ళకద్దుకొంది సౌభాగ్యం.

ఎంత మాటన్నారండీ! గోదారితల్లి కరుణిస్తే, నేతల్లినవుతాను అంది బొంగురు కంఠంతో.

ఆం ఊరుకో! ఇది బస్సు. ఉస్సురనకు... అన్నాడు సముదాయిస్తూ రంగనాథం.

ఊం... మీరెపుడూ ఇంతే!... అంటూనే భుజాన వేసిన భర్త చేతిని తీసేసింది.

శ్రీమతీ! జాడీలేం ఖర్మ... మూతలు కూడా కొందాం.

చాల్లెండి మీ మాటలు... జాడీలు కొంటే, వాళ్ళే మూతలు కూడా ఇస్తారు.

**డా॥ ఆకొండి విశ్వనాథం**

అలాగా! ఈ విషయం నీకెలా తెలుసు?... అన్నాడు నవ్వుతూ.

నేనేమంత వెర్రిబాగులదాన్ని కాదు.

అంత కాదంటే, కొంత అవునన్నట్లేగదా!

ఇంతకీ జాడీలు కొందామా? వద్దా? తేల్చి చెప్పండి! లేదంటే వెనక్కి వెళ్ళిపోదాం!

ఆc... అంత మాటనకు. తప్పకుండా కొందాం. రెండు కాకపోతే నాలుగు అన్నాడు బుజ్జగిస్తూ. ఇంతలో రాజమండ్రి వచ్చేసింది. అంతా దిగిపోతున్నారు.

ఇద్దరూ దిగి, ఆటో ఎక్కి కోటిలింగాలరేవు చేరారు.

భుజాన ఉన్న సంచీ గట్టు మీద పెట్టారు. ఇద్దరూ రేవులో దిగారు. సంకల్పం చెప్పు కొన్నారు. చెయ్యీచెయ్యీపట్టుకొని మూడు సార్లు మునిగిలేచారు. స్నానాలు పూర్తిచేసి, తడిబట్టలు పిండి, ప్లాస్టిక్ సంచీలోకి సర్దారు. సంచీలోని ఇస్త్రీబట్టలు ధరించారు. నాలు గడుగులు వేశారు. ప్రక్కనే ఉన్న మారుతిని కొలిచారు. మార్కండేయస్వామిని దర్శించారు.

ఆమె భక్తికి చకితుడయ్యాడు రంగనాథం. ఆమె కళ్లల్లోకి చూసాడు. ఐశ్వర్యారాయ్‌లాంటి కళ్ళు. ఇంక వళ్లు... ఆమెకామేసాటి అని లోలోపల మురిసిపోయాడు.

ఏమిటండీ! అలా చూస్తున్నారు?... అని కాస్తంత సిగ్గుపడింది.

ఆc... ఆప్కో చీరలో నీ అందం ఆరెట్ల యింది! ఇంటికి పద. నీ సంగతి చెప్తా!...

ఇంతకీ జాడీల సంగతి... అంది సౌభాగ్యం!

అవునవును... ముందు అవి కొనాలిగా... అంటూనే జాడీల దుకాణానికి వెళ్లి, గుండ్రటి జాడీలు రెండు కొన్నాడు. మూతలు సంచీలో పెట్టి, చెరో జాడీ పట్టుకొని బస్సెక్కారు.

బస్సులోని వాళ్లందరి కళ్లూ జాడీలపైనే పడుతున్నాయని సౌభాగ్యం తల్లడిల్లింది. ఏమండీ! అందరి దృష్టీ జాడీలపైనే. ఇంటి కెళ్ళాక దిష్టితియ్యాలండీ... అన్నది ముద్దొస్తున్న జాడీలను మురిపెంగా చూసుకొంటూ...

ఔను. తప్పక తీద్దాం!... అంటూనే టిక్కట్లు తీసుకొన్నాడు.

శ్రీమతీ! ఇంకా ఏవేవో కొనాలన్నావ్!...

పసిపాప బుగ్గల్లా, ముద్దులొలుకుతున్న జాడీలు చూశాక, ఇంకేమీ కొనదల్చుకోలే దండీ!...

ఏమండోయ్! ఒక జాడీలో ఆవకాయ, మరో జాడీలో మెంతికాయ పెడదాం!... ఏమంటారు?... అంది ఆప్యాయంగా భర్తవైపే చూస్తూ, రేవులో మాటలను గుర్తుచేసుకొంటూ.


అలాగే! నీ మాట కాదంటానా? అంటే నువ్వూరుకొంటావా? అన్నాడు రంగనాథం.

నా మాటలన్నీ వింటున్నట్లే మాట్లాడతా రు... ఎంత విడ్డూరం!... అంటూ ఓ క్రీగంటి చూపు విసిరింది.

తనమాట నెగ్గినందుకు లోలోన సంతోషిం చింది. ఇంతలో వాళ్ల ఊరు వచ్చింది. జాడీలు పుచ్చుకొని మెల్లిగా ఇల్లు చేరారు.

జాడీలు జాగ్రత్తగా కడిగి, తుడిచి, గాలిలో ఉంచింది. జాడీలకు దిష్టితీస్తూనే, ఏమండోయ్! మంచిపుల్లని మామిడికాయలు తెండి. ముందు ఆవకాయ పెట్టేద్దాం!... అంది.

అలాగే... కారం, ఆవగుండ, ఉప్పు, నూనె




అన్నీ సిద్ధం చెయ్యి. అరగంటలో తెస్తా! అంటూ వెళ్ళాడు.

సౌభాగ్యం అన్నీ సిద్ధంచేసేలోపే మామిడి కాయలు తెచ్చాడు.

అవన్నీ కడిగి, తుడిచి, ముక్కలుకోసి, వాటి పై నూనెపోసి, ఆవగుండ, కారంగుండ, ఉప్పు సమపాళ్ళల్లో వేసి కలిపి, కాసిన్ని మెంతులు కూడా వేసి, కాస్తంత నూనెపోసి, ముక్కలతో కలిపి జాడీలోకి ఎక్కించారు. మూతవేసి, గాలిపోకకుండా మంచి వస్త్రంవేసి కట్టి, వంటింట్లో పెట్టారు. ఆ ప్రక్కనే మరో జాడీ చూస్తోందేమో... ఏమండీ! మెంతికాయ కూడా పెట్టేద్దామా?... అంది.

ఇప్పటికే ఐదువందలామదమైంది. తర్వాత చూద్దాంలే!... అన్నాడు.

ఆc... తినేటప్పుడు ఇవేమీ గుర్తుకురావు. ఇంకాస్త వెయ్యి అంటూ కంచెడన్నంలో ఆవకాయ కలిపి నువ్వులనూనె పోసి మరీ లాగిస్తారు... అంటూ మాటల్ని సాగదీసింది.

శ్రీమతీ! మనకు పెళ్ళయి పదేళ్లయింది. పెళ్ళయినప్పటి నుంచీ నీకో రెండు జతల బంగారుగాజులు చేయించాలని, ప్రతీనెలా జీతంలోంచి కొంచెం కొంచెం తీసి బ్యాంకులో దాస్తున్నా. ఇలా ప్రతీదానికీ ఖర్చు చేసేస్తే, నేనెప్పటికి చేయించేది? నువ్వే చెప్పు!... అన్నాడు ప్రేమగా బుగ్గనిమురుతూ!

అవునండోయ్! అలాగే కానివ్వండి!... అంది నవ్వుతూ... దగ్గరికి చేరిన భర్తతో.

పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోందేమో, సౌభాగ్యం వెన్నెల వెలుగులో మిలమిలా మెరిసిపోతోంది. సౌభాగ్యం సిగ్గుమొగ్గ విరిసింది. చంద్రుడు మురిసాడేమో మబ్బుల్లో దాక్కున్నాడు. రాత్రికి సిగ్గేసి తప్పుకొంది.

ఆ రోజు ఏకాదశి మంచిరోజని బ్యాంక్‌కి

వెళ్ళాడు రంగనాథం. తన అక్కౌంట్‌లోంచి ఏభై వేలు తీసుకొన్నాడు. నాలుగుసార్లు లెక్కపెట్టు కొని, సంచీలో పెట్టుకొని, బిక్కుబిక్కుమను కొంటూ ఇల్లు చేరాడు. మధ్యలో ఎవరేనా చూస్తారేమోనన్న భయం. డబ్బు పాపిష్టిది. ఎవరి కన్నుపడితేనో?... అనుకొన్నాడు.

రెండేళ్ళ క్రితం ఓ బీరువా కొన్నాడు. దాంట్లో వాళ్ళిద్దరి దుస్తులూ పెట్టుకొంటారు. పైకం కూడా దాంట్లోనే భద్రంచేస్తుంటాడు. డబ్బుతెచ్చిన విషయం భార్యకు చెప్పాడు. అది పదేళ్ల సంపాదనలో కష్టపడి దాచుకొన్న సొమ్మాయె...

ఏమండోయ్! సొమ్ము భద్రం... అంది సౌభాగ్యం.

అలాగే!... అని సొమ్ము భద్రపరిచి, గాజుల విషయం అడగడానికి బజారుకు వెళ్ళాడు రంగనాథం. కొట్టువాడిని కలుసుకొన్నాడు.

ఏమండీరంగనాథంగారూ! గాజులు తయారయ్యాయి. రేపు వచ్చి పట్టుకెళ్ళండి!... అన్నాడా షావుకారు.

సుమారుగా ఎంతైందంటావు... అన్నాడు రంగనాథం.

ఆc... ఎంతైందండీ... ఓ ఏభైవేలదాకా అవుతుందనుకొన్నాంకదా! సుమారుగా అంతే లెండి... అన్నాడు.

సరే! రేపు వస్తాలే... అని రంగనాథం వచ్చేసాడు.

విషయాన్నంతా విన్న సౌభాగ్యం చేతులకేసి చూసుకొంటూ మురిసిపోయింది.

జాడీ వచ్చిన వేళా విశేషం... చేతులకు గాజులొస్తున్నాయ్!... అంటూనే జాడీకో ముద్దిచ్చి, మొగుడు దగ్గర కొచ్చింది. ఇద్దరూ భోంచేసి, తాంబూలం వేసుకొని, మంచంపై నడుంవాల్చారు. డిమ్‌బల్బు నవ్వుకొంటోంది.

ముద్దుముచ్చట్లతో అలసిన ఆ దంపతుల్ని గాఢనిద్ర కౌగిలించుకొంది.

* * *

అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. వంటింటి కిటికీ చువ్వలు తీసి ఇద్దరు లోనికి ప్రవేశించారు. ఒకడు చువ్వ తీసుకొని ముందడుగేసాడు.

ఒరేయ్! చువ్వ అక్కడ పారెయ్! మనం వచ్చింది డబ్బు కోసం. దొరికితే భోజనం కూడా చేసిపోదాం. అంతేకానీ మనుషుల్ని చంపకూడదురా... మనం బ్రతికించలేనోళ్లం – మనకి చంపే హక్కులేదు. ఒరేయ్! ఈ బాబు బ్యాంకులో డబ్బుతీయటం చూసాం. వెంబడించి ఇల్లు తెలుసుకొన్నాం... డబ్బు ఎక్కడుందో వెదుకుదాం అన్నాడు.

నిజమేరా! పద... అంటూ చువ్వ ఒక మూల పెట్టాడు. ఒరేయ్! పొద్దుటి నుంచీ తిండిలేదు కదరా! ఇల్లు కనుక్కోవటవే సరిపోయింది. వంటిల్లులా ఉంది. కాస్తంత కూడుందేమో చూదరా!... అన్నాడొకడు.

అక్కడున్న గిన్నెల మూతలు తీసి చూశాడు రెండోవాడు. ఒరేయ్! కూడు బాగానే ఉందిరా! డబ్బు తెచ్చుకొన్న సంబరంలో కూడు సరిగ్గా తినలేదనుకొంటా!... అన్నాడు.

ఇద్దరూ రెండు కంచాల్లో అన్నం పెట్టుకొన్నారు. ప్రక్కనున్న జాడీగుడ్డ విప్పి, దాంట్లోని ఆవకాయ వేసుకొన్నారు. కలిపి లాగించేసారు. ప్రక్కగిన్నెలో ఉన్న మజ్జిగ తాగేశారు.

ఒరేయ్! కొత్త ఆవకాయ భలేగా ఉందిరా!

ఈ డిమ్‌లైట్‌లో సరిగ్గా కనపడటంలేదు... బీరువా ఎక్కడుందో చూడరా!... అన్నాడు. ఇద్ద రూ అగ్గిపుల్లగీసి, బీరువా చేరారు. జాగ్రత్తగా బీరువా తలుపు తెరిచారు.

ఒరేయ్! బీరువా తాళాలు బీరువాపైనే ఉన్నాయి కాబట్టి మన పని సులువు. లోపల తొందరగా వెతుకు అన్నాడు.

గుడ్డచుట్టిన మూట ఒకటి కనబడింది. జాగ్రత్తగా తీసాడు. ప్రక్కన కొంత పైకం ఉంటే అదీ తీసాడు. ఇంతలో బీరువాలోని స్టీలుప్లేట్లు క్రిందపడి చప్పుడైంది.

ఒరేయ్ మూట దొరికింది కదా! వాళ్లు లేస్తారేమో, పారిపోదాం! అంటూ వాళ్లిద్దరూ ఆ మూట పుచ్చుకొని, కిటికీలోంచి దూకి పారిపోయారు.

భళ్లున తెల్లారింది. ముందుగా లేచిన సౌభాగ్యం చిందరవందరగా ఉన్న ఇల్లంతా చూసింది. వంటింట్లోకి వెళ్లింది. కిటికీ చువ్వ లు తీసి ఉన్నాయి. భోజనాలు చేసిన కంచాలు, గ్లాసులు చూసి ఘొల్లుమంది.

ఏమండోయ్ దొంగలు... దొంగలు పడ్డా రండీ!... అంటూనే నెత్తీనోరూ బాదుకొంటూ పదేళ్ల కష్టార్జితమంతా నాశనమైపోయిందం డీ!... అని బావురుమంది.

అంతే! చుట్టుపక్కలవాళ్ళంతా పోగయ్యా రు. విషయం విన్నారు. ఇల్లంతా చూశారు...

రంగనాథం నోటమాట రాలేదు. ఆమె పెడబొబ్బలకు అంతా బాధపడి, ఊరుకోమ్మా! పోయింది వస్తుందా? అయినా అంత డబ్బు ఇంట్లో పెట్టుకుంటారా? పెట్టుకొన్నారే అను కో... కాస్తంత మెలకువగా ఉండొద్దూ!... అంటూ అమ్మలక్కలంతా తలో కామెంట్ చేసే సారు. వారి మాటలు పుండుమీద కారం జల్లి నట్లయ్యాయి.

ఏమండోయ్! బీరువాలో దాచిన నామూట కూడా పోయిందండీ... అని బావురుమంది.

అదేంటే అమ్మాయ్... అందులో ఏమున్నా య్? అంది ప్రక్కంటి శాంతమ్మ కాస్తంత విస్తుపోతూ.

పిల్లాడుపుడితే ఆడుకొంటాడని కొండపల్లి బొమ్మలబుట్ట కొన్నా. అది మూటకట్టి బీరువా లో దాచా. అదీ పట్టుకొని పోయారు... గాజుల కని నిన్ననే ఏభైవేలు తెచ్చారు. దాని సంగతీ అంతే... అంటూ మళ్లీ ఏడుపందుకొంది సౌభా గ్యం...

ఇదంతా కొత్త జాడీవచ్చిన వేళావిశేషమ మ్మా... అంటూ మూతి మూడు వంకర్లు తిప్పిన మీనాక్షి వ్యంగ్యంగా మాటల్ని సాగదీసి అంటూ వెళ్ళిపోయింది.

ఇదంతా వీళ్ల ఖర్మ... అనుకొంటూ అంద రూ మెల్లిగా జారుకొన్నారు.

ఓ ప్రక్క నుంచుని ఇదంతా వింటున్న రంగ నాథం వంటింట్లోకి పరుగెత్తి, ఖాళీగా ఉన్న కొత్త జాడీ తెచ్చాడు. దానిని పెళ్లాం ఒడిలోపెట్టి మూత తెరిచాడు.

అంతే... సౌభాగ్యం మురిసిపోయింది. లోపల ఉన్న ఏభైవేలూ నవ్వుతున్నాయ్. మరో గంటలో సౌభాగ్యం రెండు చేతులూ రవ్వల గాజులతో సవ్వడి చేసాయి. ఆవకాయ జాడీ లోని నాలుగు ముక్కలు కడుక్కొని తింది. గోదారి తల్లికి నమస్కరించింది. సౌభాగ్యం సంబరం అంబరపుటంచులు చుంబించింది. తొమ్మిది మాసాల్లో మాతృత్వపు మాధుర్యాన్ని చవిచూసింది. ●